క్లుప్తంగా

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ



పవర్ లిఫ్టింగ్‌లో సిల్వర్ పథకం సాధించిన రాజు (తెల్లని టీషర్ట్ ధరించిన వ్యక్తి)

సీతానగరం: జార్ఖండ్ రాష్ట్రం టాటానగర్‌లో ఈ నెల 19 నుంచి 21 వరకూ జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రాజమహేంద్రవరంలోని భారతీయ వ్యాయామ కళాశాల నుంచి ఇనుగంటివారిపేటకు చెందిన యల్లమెల్లి రాజు పాల్గొని ప్రతిభ చాటాడు. స్క్వాడ్ 185 కిలోలు, బెంచ్ ప్రెస్ 95 కిలోలు, డెడ్ లిఫ్ట్ 215 కిలోలు ఎత్తి సిల్వర్ మెడల్ సాధించాడని భారతీయ వ్యాయామ కళాశాల కోచ్ డి.లక్ష్మీనారాయణ తెలిపారు. రాజును ఇనుగంటివారిపేట వైఎస్సార్ సీపీ సర్పంచ్ సత్యం రాంపండు, వైస్ ఎంపీపీ–2 సత్యం మదన్‌బాబు అభినందించారు. కోచ్ లక్ష్మీనారాయణ, యాళ్ల రవి మాట్లాడుతూ రాజు జాతీయ స్థాయిలో సత్తా చాటేందుకు దాతలు సహకరించాలని కోరారు.

కోరుకొండ ఎస్సైగా నాగార్జున



కోరుకొండ: స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్సైగా కేవీ నాగార్జున శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాజానగరం నుంచి బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకూ బాధ్యతలు నిర్వహించిన కూన నాగరాజు గురువారం రిలీవ్ అయ్యారు. రాజకీయ నాయకుల ఒత్తిడి కారణంగా ఆయన ఆకస్మికంగా రిలీవ్ అయినట్టు స్థానికులు చర్చించుకుంటున్నారు.

శక్తి యాప్‌పై అవగాహన



శక్తియాప్‌పై అవగాహన కల్పిస్తున్న కానిస్టేబుల్ శ్రీనివాసరావు

సీతానగరం: స్థానిక బస్టాండ్ వద్ద విద్యార్థినులకు శక్తి యాప్‌పై కానిస్టేబుల్ శ్రీనివాసరావు శుక్రవారం అవగాహన కల్పించారు. విద్యార్థినులు శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని, అత్యవసర సమయంలో యాప్ ఓపెన్ చేసి ఎస్ఓఎస్‌ను ఐదుసార్లు నొక్కితే సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు చేరుతుందన్నారు. ఆపదలో ఉన్నవారి వద్దకు శక్తి టీమ్ వచ్చి సహాయం చేస్తుందన్నారు. తప్పనిసరిగా సెల్‌ఫోన్‌లో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



పోలవరం కాలువపై రహదారిని పరిశీలిస్తున్న అధికారులు

కోరుకొండ: 516వ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నట్లు రోడ్లు భవనాల శాఖ డీఈ నిక్కీ క్రజ్ అన్నారు. శుక్రవారం కోరుకొండ మండలం మధురపూడి విమానాశ్రయం నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా పోక్సుపేట వరకూ ఉన్న రహదారిలో ఆయన సర్వే చేశారు. కోరుకొండ సీఐ సత్య కిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సర్వేలో 15 ప్రమాద స్థలాలను గుర్తించారు. అక్కడ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోనున్నన్నట్టు నిక్కీ తెలిపారు. రహదారికి ఇరువైపులా ఆక్రమణలు గుర్తించామన్నారు. పలు ప్రాంతాల్లో ప్రమాద హెచ్చరిక బోర్డుల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్టు తెలిపారు. ఎస్సైలు నాగార్జున, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

పర్యావరణ హిత రవాణాకు కృషి



మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్

రాజానగరం: పర్యావరణ హితమైన రవాణా వ్యవస్థను మరింత మెరుగుపర్చేందుకు సమష్టి కృషి చేద్దామని స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) వీసీ డాక్టర్ యు.చంద్రశేఖర్ అన్నారు. యూనివర్సిటీలోని ఆటోమొబైల్ విభాగం ఆధ్వర్యంలో 'వాహనాల్లో ప్రత్యామ్నాయ ఇంధనంగా హైడ్రోజన్ ప్రాముఖ్యత' అనే అంశంపై శుక్రవారం సెమినార్ జరిగింది. సమావేశంలో వీసీ డాక్టర్ కేవీబీ రాజు, సమన్వయకర్త వి.సుబ్రహ్మణ్యం, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎం ఎం శర్మ, డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, డీన్స్ డాక్టర్ ఎస్.లీలావతి, డాక్టర్ బి.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై శ్రద్ధ చూపండి

బిక్కవోలు: గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో ఎప్పటికప్పుడు చెత్త తరలించి, దోమలు వ్యాప్తి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు.



రాజమహేంద్రవరం - సీతానగరం ఆర్‌అండ్‌బీ రోడ్డుపై రఘుదేవపురం వద్ద గోతులు



చెరువు కాదు: రఘుదేవపురం వద్ద అధ్వానంగా రోడ్డు

ఉయ్యాల.. జంపాల!

- రఘుదేవపురం నుంచి సీతానగరం రోడ్డులో దుస్థితి
- ప్రయాణం నరకం అంటున్న వాహనదారులు

సీతానగరం: ఊగడానికి ఉయ్యాలే అవసరం లేదు.. రఘుదేవపురం నుంచి సీతానగరం వరకూ ఆర్అండ్‌బీ రోడ్డుపై ప్రయాణిస్తే చాలు. ఉయ్యాల.. జంపాల అనుభూతి పొందవచ్చు. మొత్తం గుంతలమయంగా ఉండడం, రోడ్డు మచ్చుకు ఆనవాళ్లు కానరాకపోవడంతో ప్రయాణికులు నరకం చూస్తున్నారు. కూటమి సర్కారు వచ్చి ఏడాదిన్నర అవుతున్నా కనీసం మరమ్మతులనూ పట్టించుకోకపోవడం శోచనీయం. ఇక్కడ నాలుగు లైన్ల రోడ్డు వేయలేమని తేల్చి చెబుతూనే, రోడ్డుపై పడిన గోతులను తాత్కాలికంగానైనా పూడ్చడం లేదని మండల ప్రజలు అంటున్నారు.

రాజమహేంద్రవరం రూరల్ కాతేరు నుంచి సీతానగరం వరకూ నాలుగు లైన్ల ఆర్అండ్‌బీ రోడ్డు పనులు రఘుదేవపురం శివారు వరకూ పూర్తయ్యాయి. రఘుదేవపురం నుంచి సీతానగరం రెండు కిలోమీటర్ల రోడ్డు గోతులుపడి అధ్వానంగానే ఉంది. ఈ రోడ్డు అభివృద్ధి పనులు ముందుకు కదలడం లేదు. ఇటుగా ప్రయాణం వాహనచోదకులకు నరకప్రాయంగా మారింది. మూడు నెలల క్రితం రోడ్డుపై పడిన గోతుల్లో పెద్ద రాళ్లతో చప్టు వేశారు. వర్షాలకు చప్టు కొట్టుకుపోయి, మళ్లీ పెద్ద గోతులు ఏర్పడ్డాయి. గోతులను తప్పించే క్రమంలో వాహనాలు ఢీకొని పలువురు ఆసుపత్రుల పాలవుతున్నారు. దీనిపై 'సాక్షి' దినపత్రికలో వచ్చిన పలు కథనాలతో స్పందించిన ఆర్అండ్‌బీ అధికారులు ప్రొక్లెయిన్‌తో గోతులను సర్ది వదిలేశారు. అయితే ఇటీవల రోడ్డును కుదించి 30 అడుగుల రోడ్డు పనులను ఈ నెల 7న అధికారులు ప్రారంభించారు. ప్రజల అవసరార్థం నాలుగు లైన్ల రోడ్డు వేయాలని కోరుతూ రోడ్డుపై ధర్నా చేయడంతో పది మంది వైఎస్సార్ సీపీ నాయకులపై కేసులు పెట్టారు. తర్వాత ఈ నెల 11న రోడ్డు విషయమై ఎమ్మెల్యే దృష్టిలో పెట్టడానికి వైఎస్సార్ సీపీ నాయకులు రోడ్డుపైకి రాగా, మళ్లీ పది మందిని అరెస్ట్ చేసి, గోకవరం పోలీస్ స్టేషన్‌కు తరలించి రెండోసారి కేసులు పెట్టారు. ఈ నెల 12, 13న ముప్పై అడుగుల రోడ్డు వేయడానికి అధికారులు పనులు ప్రారంభించి మధ్యలో వదిలేశారు. వర్షాలకు రోడ్డుపై మరిన్ని గుంతలు పడ్డాయి. దీంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. గత వైఎస్సార్ సీపీ హయాంలో రఘుదేవపురం శివారు వరకూ నాలుగు లైన్ల రోడ్డు వేశారు. ఈ రోడ్డులో వాహనచోదకులకు సాఫీగా సాగిపోతున్నారు. రఘుదేవపురం నుంచి సీతానగరం వరకూ ప్రయాణం మాత్రం నరకప్రాయంగా మారింది. రెండు కిలోమీటర్ల ఆ రోడ్డుపై పడిన గోతులను తాత్కాలికంగానైనా పూడ్చి వాహనాలు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు వేయమంటే కేసులు పెట్టారు



రఘుదేవపురం నుంచి సీతానగరం వరకూ కేవలం రెండు కిలోమీటర్ల నాలుగు లైన్ల రోడ్డు వేయలేని పరిస్థితిలో కూటమి ప్రభుత్వం, ఆ నేతలు ఉన్నారు. 30 అడుగుల రోడ్డు వేసి చేతులు దులుపుకోవాలని స్థానిక ఎమ్మెల్యే చూస్తున్నారు. మంజూరైన రోడ్డు వేయలేని పరిస్థితిలో ఉన్నారు. నాలుగు లైన్ల రోడ్డు వేయాలని కోరితే రెండుసార్లు కేసులు పెట్టారు. రోడ్డుపై గోతులు కూడా పూడ్చడం లేదు. రోడ్డుపై ప్రజలు నరకం చూస్తున్నారు.

–పెదపాటి రమేష్‌బాబు, వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు, సీతానగరం

కుదించడం విడ్డూరం



కాతేరు – సీతానగరం ఆర్అండ్‌బీ రోడ్డును స్టేట్ హైవేగా మార్చి నాలుగు లైన్ల రోడ్డును అప్పటి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా రఘుదేవపురం వరకూ వేయించారు. ఎన్నికల కోడ్‌తో రెండు కిలోమీటర్ల పనులు ఆగాయి. మంజూరైన రోడ్డును కూటమి ఎమ్మెల్యే వేయించలేకపోవడం విడ్డూరంగా ఉంది. పెద్ద గోతులు పడి వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయంగా మారింది. గంపెడు మట్టి కూడా వేయలేకపోతున్నారు. వర్షం పడితే నరకం చూస్తున్నాం.

–పిండి రాధాకృష్ణ, రఘుదేవపురం

భావితరాలకు ఆధ్యాత్మిక సంపద అందించాలి



కోటపాడు సాయిసదన్‌లో సహస్ర నామ పారాయణ చేస్తున్న భక్తులు

రంగంపేట: శ్రీలలిత, విష్ణు సహస్రనామ పారాయణ ద్వారా ఆధ్యాత్మిక శక్తిని పెంపొందించుకోవాలని సత్యసాయి సమితి కన్వీనర్ కందర్ప వెంకట అమర్నాథ్ సూచించారు. రంగంపేట మండలం కోటపాడు గ్రామంలో సత్యసాయి సేవాసదన్లో శ్రావణ శుక్రవారం చివరి రోజున జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్రతాలు, పూజల్లో ఉన్న అర్థాలు, అంతరార్థాలు తెలుసుకుని భావితరాలకు ఆధ్యాత్మిక సంపదను అందించడానికి పెద్దలు కృషి చేయాలన్నారు. భగవాన్ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా 100 జ్యోతులతో దీపారాధన, సామూహిక వరలక్ష్మీ వ్రతాలు, వంద మంది మహిళలతో శ్రీలలిత, శ్రీవిష్ణు నామ, హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. పాల్గొన్న మహిళలకు దివంగత వేద పండితుడు దేవులపల్లి సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం వారి సతీమణి సాయిలక్ష్మి పారాయణ పుస్తకాలను, కందర్ప సాయికుమారి ప్రసాదం అందించినందుకు సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు, సబ్ జోన్ కన్వీనర్ మట్రెడ్డి వీర్రాజు, సేవా సమితి సభ్యులు నల్ల శ్రీనివాస్, కందర్ప శ్రీరామశర్మ, శేషసాయిశర్మ, బాలవికాస్ గురువు కందర్ప భానుమతి, సీతారత్నం, వీరరాఘవ, వెంకటలక్ష్మి, సత్యవేణి, ప్రభావతి పాల్గొన్నారు.

స్వార్థం కోసమే రోడ్లు ధ్వంసం

- కూటమి నేతలదే తప్పిదం
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



కొప్పవరం వద్ద పాడైన రహదారిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: అనపర్తి– కొమరిపాలెం రోడ్డును కూటమి నేతలు ధ్వంసం చేశారని అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ధ్వజమెత్తారు. భారీ టిప్పర్ లారీల కారణంగా ధ్వంసమైన రోడ్డును శుక్రవారం ఆయన కొప్పవరం ప్రజాప్రతినిధులు, గ్రామస్తులతో కలసి పరిశీలించారు. అనంతరం డాక్టర్ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ కొమరిపాలెం, అనపర్తి, కొప్పవరం తదితర చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ రోడ్డు అభివృద్ధి గురించి దశాబ్దాలుగా ఎదురు చూశారన్నారు. టీడీపీ పాలనలో ప్రజలు పాదయాత్రలు, ఆందోళనలు చేసినా ఆనాటి, ప్రస్తుత ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక రూ.3 కోట్లు మంజూరు చేయించి రోడ్డు వేయించామని అన్నారు. ఈ రోడ్డు అనపర్తి మండల వాసులకే కాకుండా బిక్కవోలు, పెదపూడి మండలాల గ్రామాల నుంచి నియోజకవర్గ కేంద్రమైన అనపర్తికి రావడానికి ఎంతో ఉపయోగంగా ఉందన్నారు. అయితే ఇటీవల ఎమ్మెల్యే అనుచరులు కొప్పవరం గ్రామంలో ప్రైవేట్ లేఅవుట్ వేయడం, దానిని మెరక చేయడానికి భారీ వాహనాలు విచ్చలవిడిగా తిరగడంతో రోడ్డు అనేక చోట్ల కుంగిపోయి పాడైపోయిందని అన్నారు. ఒకటి, రెండు రోజులు వర్షం వస్తే రోడ్డు మొత్తం పాడైపోయే పరిస్థితి ఉందని, భారీ వాహనాలు తిరిగేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకుని ఉంటే బాగుండేదన్నారు. కానీ వారి స్వలాభం కోసం మూడు మండలాల ప్రజలకు ఇబ్బంది కలిగించారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో కొన్ని రోడ్లకు మసిపూసి మారేడు కాయ చేసిన ఎమ్మెల్యే రోడ్లకు 'మహర్దశ' అంటూ ఫ్లెక్సీలు పెట్టించుకున్నారని, చిన్నపాటి వర్షానికి ఆ ప్యాచ్ వర్క్‌లు బయట పడుతున్నాయన్నారు. అధికారులు వెంటనే జోక్యం చేసుకుని ఈ రోడ్డును బాగు చేయించాలని డాక్టర్ సూర్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పాలమూరు ఉప సర్పంచ్ సత్తి సూరారెడ్డి, మాజీ సర్పంచ్ తాడి సూరారెడ్డి, ఉప సర్పంచ్ మల్లిడి వీర్రాఘవరెడ్డి, మాజీ ఎంపీటీసీ కర్రి సత్రెడ్డి, తాడి సోమిరెడ్డి, సత్తి శ్రీనివాసరెడ్డి, వార్డు సభ్యులు సత్తి శ్రీనివాస్‌రెడ్డి, మల్లిడి సతీష్‌రెడ్డి, మేడిశెట్టి సన్యాసిరావు, నాయకులు మల్లిడి సోమిరెడ్డి, గోగు వీరవెంకట సత్యనారాయణ, పెంకె నాగరాజు, మల్లిడి ఈశ్వరరామారెడ్డి, కర్రి వెంకటరెడ్డి, కొల్లపర్తి సత్యనారాయణ, తాడి రామ్మూర్తి, కర్రి పెద్దకాపు పాల్గొన్నారు.

జాతికి జీవం పోసేది జానపద కళలే



జానపద దినోత్సవంలో మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ హరే రామకృష్ణ

సీతానగరం: జాతికి జీవం పోసేది జానపద కళలేనని సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.హరే రామకృష్ణ అన్నారు. శుక్రవారం సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ జానపద దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జానపద కళల పట్ల యువత మక్కువ పెంచుకోవాలని అన్నారు. తెలుగు అధ్యాపకురాలు, ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ ఎం.సుధామయి మాట్లాడుతూ గరగ నృత్యాలు, కోలాటం, చెక్క భజనలు, సంక్రాంతికి వచ్చే హరిదాసులు, గంగిరెద్దులు, జంగమదేవరలు, పాములాట, ఎలుగుబంట్లు, కోతులాట, తోలుబొమ్మలు, హరికథలు మన జానదప కళలు అని అన్నారు. అధ్యాపకులు డాక్టర్ వీవీ సుబ్బారావు, డాక్టర్ నాగేశ్వరరావు, షేక్ దర్గామదీనా, మీనాక్షి, వాణి, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు

బిక్కవోలు: బలభద్రపురం గ్రామంలోని పలు వీధుల్లో జానపద కళాకారులు ప్రదర్శన నిర్వహించారు. స్వచ్ఛాంధ్రం, దోమలపై దండియాత్ర, పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కళాకారులను సర్పంచ్ బుంగా రామారావు అభినందించారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించాలి



రంగంపేటలో రైతులతో మాట్లాడుతున్న డీపీఎం తాతారావు

రంగంపేట: రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ డీపీఎం తాతారావు సూచించారు. రంగంపేటలో వ్యవసాయాధికారి కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు రసాయన ఎరువులు, పురుగు మందులు వాడటం వల్ల నేలతో పాటు ప్రకృతికి ఏవిధంగా నష్టం వాటిల్లుతుందో తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించి నేల సారవంతాన్ని కాపాడుకోవాలని తెలిపారు. ఏడబ్ల్యూడీ టెక్నిక్ ద్వారా నీటి వినియోగం తగ్గించడం, నేల ఆరోగ్యం మెరుగుపరచడం, పెట్టుబడి తగ్గడం, దిగుబడులు పెరగడంతో ప్రయోజనాలను రైతులకు వివరించారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు



ఊలపల్లిలో కనకదుర్గమ్మ వారు



సంపరలో విజయదుర్గమ్మ వారు



పందలపాకలో నదీ జలాలతో అభిషేకం చేస్తున్న భక్తులు

బిక్కవోలు: మండలంలో శ్రావణ మాసం శుక్రవారం పూజలు ఘనంగా నిర్వహించారు. వరలక్ష్మీ వ్రతాలు చేశారు. ముత్తైదువలకు వాయినాలు సమర్పించారు. ఊలపల్లి జి.మామిడాడ రోడ్డులోని కనకదుర్గమ్మ, కొమరిపాలెంలో కనకదుర్గమ్మ, బలభద్రపురం సత్తెమ్మ తల్లి, బిక్కవోలులో పార్వతీదేవి, పందలపాకలో కట్లమ్మ తల్లి, తొస్సిపూడిలో నవదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కట్లమ్మ తల్లికి కుంభాభిషేకం

బిక్కవోలు: పందలపాక గ్రామంలో కట్లమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి కుంభాభిషేకం చేశారు. శ్రావణమాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా భక్తులు గోదావరి జలాలను తీసుకు వచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

పెదపూడి: శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా మండలంలోని పలు ఆలయాల్లో సామూహికంగా వరలక్ష్మీ వ్రతాలు జరిగాయి. పెదపూడి మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మహాలక్ష్మీ అష్టకం, లలితా సహస్రనామ పారాయణ, కుంకుమార్చనలు నిర్వహించారు. సంపరలో విజయదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. జి.మామిడాడ సూర్యనారాయణమూర్తి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. పెద్దాడ, రామేశ్వరం, కాండ్రేగుల, కరకుదురు తదితర గ్రామాల్లోని ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

నేటి నుంచి సామాజిక తనిఖీ గ్రామసభలు

పెదపూడి: మండలంలో శనివారం నుంచి 28 వరకూ సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహించనున్నామని ఉపాధి హామీ పథకం ఏపీఓ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం పెదపూడిలో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి సంబంధించి 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు ఏడాదిగా సుమారు రూ.10,88,48,331 మేర పనులు జరిగాయన్నారు. దీనికి సంబంధించి సోషల్ ఆడిట్ జరుగుతుందన్నారు. ఆయా గ్రామాల సభల్లో 9 మంది డీఆర్‌పీలు సోషల్ ఆడిట్‌లో పాల్గొంటారన్నారు. ఈ నెల 23న రామేశ్వరం, కరకుదురు, కైకవోలు, గండ్రేడు, వేండ్ర, 25న జి.మామిడాడ, సంపర, 28న పెద్దాడ, పుట్టకొండ, కాండ్రేగుల, రాజుపాలెం, పెదపూడి, ఏపీ త్రయం, పైన గ్రామాల్లో సభలు నిర్వహించనున్నామని తెలిపారు.

చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోండి



రంగంపేటలో కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ శివప్రసాద్

రంగంపేట: వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్ఐ శివప్రసాద్ సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల వినాయక చవితి కమిటీ సభ్యులతో స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. గణపతి నవరాత్ర ఉత్సవాలు ముగిసే వరకూ మండపాల నిర్వాహకులదే బాధ్యత అని అన్నారు. పర్యావరణ కాలుష్యం జరగకుండా మట్టి ప్రతిమలనే ప్రతిష్ఠించాలన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ) విగ్రహాలను వాడకూడదన్నారు. మండపాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పోలీసులు సూచించిన మార్గదర్శకాలను పాటించాలన్నారు. ఇతర మతస్తుల మనోభావాలను దెబ్బతీయకుండా సోదరభావంతో పరస్పర గౌరవంతో ఉత్సవాలు నిర్వహించుకోవాలన్నారు.

వ్యాయామ విద్యా ప్రాంతీయ తనిఖీ అధికారికి సన్మానం



ఆర్ఐపీఈ జాన్సన్‌ను సత్కరిస్తున్న వ్యాయామోపాధ్యాయులు

అనపర్తి: కాకినాడ వ్యాయామ విద్యా ప్రాంతీయ తనిఖీ అధికారి బి.జాన్సన్‌ను నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాల వ్యాయామోపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. శుక్రవారం అనపర్తి రామారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు విచ్చేసిన ఆయనకు హెచ్ఎం పులగం వెంకటరెడ్డి, మండల విద్యాశాఖాధికారి–2 నల్లమిల్లి సత్తిరెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ మల్లిడి పార్వతి, ఇతర వ్యాయామోపాధ్యాయులు ఆహ్వానం పలికారు. మూడు మండలాల వ్యాయామోపాధ్యాయుల సమావేశం ఏర్పాటుచేసి ఉపాధ్యాయుల జాబ్ చార్ట్‌లు, రికార్డులు, రిజిస్టర్లపై పలు సూచనలు చేశారు. అనపర్తి జోన్ సెక్రటరీ టీవీవీఎస్ రాఘవరెడ్డి, చిక్కా రాజశేఖర్, ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్వేను త్వరితగతిన పూర్తి చేయండి



సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్

రంగంపేట: స్వమిత్ర సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ వి.వీర సాయిబాబు సూచించారు. రంగంపేట గ్రామంలో పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది నిర్వహిస్తున్న సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ ఈ సర్వేతో గ్రామాల్లోని ప్రజల వ్యక్తిగత ఆస్తుల వివరాలతో పాటు ప్రభుత్వరంగ ఆస్తుల సరిహద్దులతో సహా భద్రత ఉంటుందన్నారు. ప్రతి ఇంటితో పాటు రోడ్లు, చెరువులు, ఆలయాలు, అంగన్‌వాడీ, హెల్త్ సెంటర్లు, పంచాయతీ ఆస్తులు వంటివి సర్వే చేస్తారన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ సర్వే చేస్తున్నట్టు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి వెలిచేటి శ్రీరామమూర్తి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరంలో..

సీతానగరం: మండలంలో ప్రభుత్వ సర్వేలు సత్వరమే పూర్తి చేయాలని డివిజనల్ డవలప్‌మెంట్ ఆఫీసర్, గ్రామ, వార్డు సచివాలయాల ఇన్‌చార్జ్ ఆఫీసర్ పి.వీణాదేవి సూచించారు. శుక్రవారం సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, డిజిటల్, వెల్ఫేర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సర్వే అసిస్టెంట్లకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వమిత్ర సర్వేపై ఆరా తీశారు. ఎంపీడీఓ ఎం.భారతి, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య, హౌసింగ్ ఏఈ నాగచక్రం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సత్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు

యూరియా అందక రైతన్నలకు కష్టాలు



బూరుగుపూడిలో విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు కంటే వినయ్‌తేజ

కోరుకొండ: అన్నదాతలకు సకాలంలో యూరియా అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్ సీపీ నాయకుడు, వ్యవసాయ సలహా మండలి జిల్లా మాజీ సభ్యుడు కంటే వినయ్‌తేజ దుయ్యబట్టారు. బూరుగుపూడిలోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజానగరం నియోజకవర్గంలో 16,150 హెక్టార్ల సాగు భూమికి325 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందన్నారు. కోరుకొండ మండలానికి 80 మెట్రిక్ టన్నులు కావాల్సి ఉండగా, కేవలం 35 మెట్రిక్ టన్నులు అందించారన్నారు. యూరియా రైతన్నలకు సకాలంలో అందక ఇబ్బంది పడుతున్నారన్నారు. దివ్యాంగుల పింఛన్లను తొలగించడం సరికాదని వినయ్‌తేజ అన్నారు. బూరుగుపూడికి చెందిన ఇంజే ప్రేమ్‌కుమార్‌కు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో దివ్యాంగ పింఛను అందించేవారన్నారు. అతనికి దృష్టిలోపం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పింఛను తొలగించడం దుర్మార్గమన్నారు. సమావేశంలో నాయకులు గెడ్డం శంకర్, పెనుగుల ప్రకాశం, చొంగా వెంకటేశ్వరరావు, బాదంపూడి శ్రీను, ఇంజి విజయ్‌కుమార్, ఇంజి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.